## నా భూమికి ధరణితోనే పట్టా అయ్యింది..



ములుగు, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : మా నాయిన 10 ఏళ్ల క్రితం ఆరెకరాల భూమి ఇచ్చిండు. పట్వారీల చుట్టూ తిరిగి తిరిగి గోస పడ్డ. పట్టా అయ్యేలోపు ఉన్న పట్వారి మారేది. వచ్చిన కొత్తోడు చేయు చాపేది. ఎంటికెలు నెర్సినయ్ కాని పని కాలె. 2021లో ధరణి ద్వారా భూమికి పట్టా అయింది. భూమి అసలు పట్టాకు ఎక్కడని చాలా రందిపడెటోడిని. సీఎం కేసీఆర్ ధరణి తీసుకువచ్చి మంచి పని చేసిండు. మధ్య దళారులు లేరు. సక్కగ తహసీల్దార్ ఆఫీసుకు పోయిన. రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్‌లో కట్టుకున్న. ధరణిలో ఒక్క సారి పేరెక్కితె ఎవడు తీసేది లేదు. పైసలు పెట్టేది లేదు.

**- మోరె లక్ష్మీనారాయణ, రైతు, ఇంచర్ల, ములుగు మండలం.**

## 24 గంటల కరెంట్‌తోనే మంచిగున్నది..



ములుగు రూరల్, నవంబర్ 25 : రైతులకు ప్రస్తుతం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తోనే పంటలు మంచి పండుతున్నయి. 3 గంటల కరెంట్ ఇస్తే ఎకరం పొలానికి నీళ్లు పారవు. గతంతో చూసుకుంటే పంటలు పండించుడు బాగా పెరిగింది. దీనికి ఉచితంగా అందిస్తున్న 24 గంటల కరెంటే కారణం. ఇగ 3 గంటల కరెంట్ అనే మాట రైతులను ఇబ్బందులు పెట్టుడు తప్ప ఏమీ లేదు. 24 గంటలు కరెంట్ ఉండటం వల్ల రైతులకు అనుకూలమైన సమయంలో పొలానికి నీళ్లు పారించుకోవచ్చు. దీని వల్ల రైతులకు కూడా చాలా మేలు జరుగుతుంది.

**- శానబోయిన రమేశ్, రైతు, ఇంచర్ల, ములుగు మండలం.**



# ఎన్నికల నియమావళిని పాటించాలి

- ■ ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి
- ■ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రత్నాకర్ ఝా
- ■ మీడియా సెంటర్ తనిఖీ

ములుగు టౌన్, నవంబర్ 25 : ప్రవర్తనా నియమావళిని ప్రింట్ , ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా కచ్చితంగా పాటించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రత్నాకర్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను రిటర్నింగ్ అధికారి అంకిత్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంసీఎంసీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనల వంటి వాటిపై తక్షణమే స్పందించాలని, లోకల్ చానల్స్‌లో వచ్చే వార్తలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలని సూచించారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్‌లు, టెలివిజన్ చానల్‌లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలకు ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికలు నిర్వహించే సమయంలో సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారాలు, ఇతర ప్రాంతాల్లో ఘటనలను ఇక్కడ జరిగినట్లు ప్రచారం చేయడం, పాత వీడియోలను ప్రదర్శించడం, ప్రజలను అయోమయానికి గురిచేసేలా అసత్యాలు, వదంతులు వ్యాప్తిచేస్తే చర్యలు తీసుకోనున్నట్లు ఆర్వో అంకిత్ తెలిపారు. వాట్సాప్ గ్రూప్‌ల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేయకుండా అడ్మిన్లు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల సీసీ కెమెరాల రికార్డింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఏ పీవో వసంతరావు, డీపీఆర్వో ఎండీ రఫీక్, ములుగు తహసీల్దార్ విజయ భాస్కర్, ఎంసీఎంసీ కమిటీ మెంబర్ ఎస్ శ్రీధర్, కొత్తపల్లి ప్రసాద్‌రావు, ఈడీఎం దేవేందర్, ఎస్ సత్యనారాయణ, నాయబ్ తహసీల్దార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి సయ్యద్ అబ్దుల్ రహీం, ఎస్ భవిత, సీనియర్ అసిస్టెంట్ సురేశ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏపీవో ఫిరోజ్ పాషా , బీ వెంకటేశ్వర్లు, అడ్మిన్ అసిస్ట్ తదితరులు పాల్గొన్నారు.




ఎంసీఎంసీ పనితీరును అడిగి తెలుసుకుంటున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు రత్నాకర్ ఝా

### పోలింగ్ స్టేషన్ల పరిశీలన

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్లను శనివారం సీనియర్ ఐఏఎస్ అధికారి, సాధారణ ఎన్నికల పరిశీలకుడు రత్నాకర్ ఝా సందర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు జీపీఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను పరిశీలించి వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని ఓటర్ల వివరాలు, పోలింగ్ స్టేషన్లు ఎన్ని? దివ్యాంగులు, వృద్ధులు ఓట్లు వేశారా? ఎంత మంది ఉన్నారు? అనే వివరాలు తీసుకున్నారు. ప్రస్తుత ఎన్నికల పరిస్థితి, చెక్ పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ములుగు ఎంపీడీవో ఇక్బాల్, స్థానిక ఎంపీడీవో కుమార్, ఎంఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌వోలు ఉన్నారు.



మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని ఓదారుస్తున్న నాగజ్యోతి

## బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

తాడ్వాయి, నవంబర్ 25 : మండలంలోని నార్లాపురంలో స్కూల్ వ్యాన్ ఢీకొని తీవ్ర గాయాలైన బీఆర్‌ఎస్ కార్యకర్త కాతా రమేశ్ కుటుంబాన్ని శనివారం ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి పరామర్శించారు. ఈ ఘటనలో చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే. వారి నివాసానికి వెళ్లిన నాగజ్యోతి కుటుంబాన్ని ఓదార్చి, సంతాపం వ్యక్తం చేశారు. అధైర్యపడొద్దని, రమేశ్ త్వరగా కోలుకుంటాడని, తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



పస్రాలో ఇంటింటా ప్రచారం చేస్తున్న సుమలత

## నాగజ్యోతి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

గోవిందరావుపేట, నవంబర్ 25 : బీఆర్‌ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ జిల్లా నాయకురాలు భూక్యా సుమలత అన్నారు. నాగజ్యోతి గెలుపు కోరుతూ మండలంలోని పస్రాలో మహిళలతో కలిసి శనివారం ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్టుపెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఇక్కడ అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తే జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని, అందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట మహిళలు, కార్యకర్తలున్నారు.



మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకుడు చందర్‌రాజు

## యాదవులను ఆదుకున్నది సీఎం కేసీఆరే

**మా మద్దతు బీఆర్‌ఎస్‌కే..**

గోవిందరావుపేట, నవంబర్ 25 : రాష్ట్ర వ్యాప్తంగా యాదవులను ఆర్థికంగా, రాజకీయంగా ప్రాధాన్యత ఇచ్చి ఆదుకున్నది సీఎం కేసీఆరేనని యాదవ సంఘం జిల్లా నాయకుడు చందర్‌రాజు అన్నారు. శనివారం పస్రాలో ఏర్పాటు చేసిన యాదవ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదవులు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం కోట్లాది నిధులు వెచ్చించారని, అలాంటి మహనీయుడి సేవలను తమ సభ్యులు మర్చిపోరన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఆరుగురు ఎమ్మెల్యేలు, ఒక రాజ్యసభ, ఒక ఎమ్మెల్సీ, 10 మందికి కార్పొరేట్ పదవులతో పాటు పలువురికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో తమ సంఘం పూర్తి మద్దతు బీఆర్‌ఎస్‌కే ఇస్తుందని తెలిపారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మంగపేట, నవంబర్ 25 : సెర్ప్ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కమలాపురం, తిమ్మంపేట, చెరుపల్లి, మల్లూరు, రమణక్కపేట, గంపోనిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను శనివారం అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ బాలస్వామి, డీపీఎం గోవింద్‌చౌహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అప్పారావు, సీసీలు సత్యనారాయణ, శ్రీను, జనార్దన్, మల్లేశ్వరి, తార, ఏఈవో గాయత్రి, కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీడీ బాలస్వామి

## వాహనాల తనిఖీ

ఏటూరునాగారం, నవంబర్ 25 : మండల కేంద్రంలోని ఎన్నికల చెక్ పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. వచ్చి పోయే వాహనాల నంబర్లను నమోదు చేస్తూ బ్యాగులు, సూట్‌కేసులు, ఇతర లగేజీని పరిశీలిస్తున్నారు. ఏటూరునాగారానికి వచ్చి పోయే వాహనాలపై నిఘా పెట్టారు. డబ్బు, మత్తు పదార్థాల తరలింపు వివరాలను సేకరిస్తున్నారు. సివిల్, సీఆర్‌పీఎఫ్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## నేడు, రేపు పత్తి కొనుగోళ్లు బంద్

ములుగురూరల్, నవంబర్ 25 : పత్తి కొనుగోళ్లను ఆదివారం, సోమవారం నిలిపివేసి ఈ నెల 28 నుంచి తిరిగి ప్రారంభించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి సుచిత్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాధారణ సెలవుతో పాటు సోమవారం కార్తీక పౌర్ణమి, గురునానక్ జయంతి సందర్భంగా ములుగు మండలంలోని జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి 28న పత్తిని మిల్లులకు తీసుకురావాలని సుచించారు.



ఓటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులు, చిత్రంలో అడిషనల్ కలెక్టర్ వెంకన్న

## ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

**ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్నికల సిబ్బంది**

**28 వరకు కొనసాగనున్న పోలింగ్**

ములుగు రూరల్, నవంబర్ 25 : ములుగు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శనివారం ప్రారంభమైంది. సంక్షేమ భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, ఓటింగ్ సరళిని అడిషనల్ కలెక్టర్ డీఎస్ వెంకన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ములుగు నియోజకవర్గానికి చెందిన 246 మంది, ఇతర నియోజకవర్గాలకు చెందిన 1,651మంది కలుపుకొని మొత్తం 2,797 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు. ఈ నెల 28 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కొనసాగనున్నదని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు.